క్లుప్తంగా

రస్తాలో బంకు వేశారు

పాణ్యం : మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాల వెళ్లే రస్తాలో బంకు వేశారని ప్రిన్సిపాల్ శోభరాణి డిప్యూటి తహసీల్దార్ శివశంకర్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల వెళ్లే ప్రధాన దారిలో వేసిన బంకు రాకపోకలకు ఆటంకంగా మారిందని, బంకును తొలగించాలని కోరారు. అలాగే పాణ్యం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. పాఠశాలకు వచ్చే గూడ్స్ వాహనాలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు.

క్రేన్లు ఢీ



ఢీకొన్న క్రేన్లను పరిశీలిస్తున్న పోలీసులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని డొంగు వద్ద బుధవారం రెండు క్రేన్లు ఢీకొన్నాయి. నంద్యాల నుంచి రైల్వే పనుల కోసం వస్తున్న క్రేన్‌ను వెనుక వస్తున్న మరో క్రేన్ అధిగమించబోయి ఢీ కొట్టింది. ఈ ఘటనతో రెండు క్రేన్లు నిలబడిపోయాయి. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు గమనించి వేగం తగ్గించడంతో ప్రమాదాలు తప్పాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

విద్యుత్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఓర్వకల్లు : ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయాలైనట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం స్థానిక బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో, 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి లోనై బడేసాహెబ్, షేక్షావలికి గాయాలయ్యాయి. వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో బడేసాహెబ్ తీవ్రంగా గాయపడ్డాడు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



మురళీమోహన్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మురళీమోహన్ పదోన్నతి పొందడంతో బుధవారం కాల్వ సచివాలయ భవనంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. కాల్వ గ్రామంలో గత మూడేళ్లుగా గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శి పనిచేసి, ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా మురళీమోహన్‌కు గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి లభించిందన్నారు. ఆ మేరకు వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మండలానికి బదిలీ అయ్యారన్నారు. అనంతరం మురళీమోహన్‌ను వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ పరిపాన అధికారి వెంకటరమణయ్య, కార్యాలయ సిబ్బంధి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

హాకీ విజేత మున్సిపల్ హైస్కూల్ జట్టు



విజేతగా నిలిచిన మున్సిపల్ హైస్కూల్ హాకీ జట్టు

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు హాకీ విజేతగా నిలిచింది. బుధవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల హాకీ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు, మునగాలపాడు జట్టుపై 3–0 స్కోర్‌తో విజయం సాధించింది. బాలుర విభాగంలో ఆరు జట్లు, బాలికల విభాగంలో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ.. విజేతలకు ఒలింపిక్ డే రోజున బహుమతులు, కప్‌లు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

20న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఒలింపిక్స్ డే పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన నగరంలోని ఓల్డ్ రఘునాథ్ టాకీస్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో అండర్–18 విభాగంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి జీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో 18 సంవత్సరాల్లోపు క్రీడాకారులకు వివిధ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 94402 51668 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వానా కాలం.. పాములతో భద్రం..!

- వర్షాకాలంలో పాముల బెడద
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

గడివేముల: వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా అటవీ ప్రాంత గ్రామాల్లో, దట్టమైన పొదల సమీపంలో పాములు సంచరిస్తుండటం సాధారణమే. అయితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. కొన్ని రోజుల క్రితం కొరప్రోలూరు బర్రెలకు మేపు తీస్తుండగా పాముకాటుకు గురై ఓ మహిళ చనిపోయింది. అదేవిధంగా మంచ్రకప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. పొలాల్లో పచ్చికబయళ్లు పెరగడంతో ఎక్కడ ఏ విష పురుగు ఉందో గుర్తు పట్టడం కష్టం ఉంటుంది. అయితే అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



ప్రమాదకరమైన త్రాచుపాము

విషపూరిత పాముల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రస్తుతం విషపూరిత జీవులు పంట పొలాల్లో సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పాములు ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ, చెట్ల పొదల్లో ఉంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అరగంటలోపు విషయం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తోంది. కళ్లు మూతలు పడడం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షవాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ప్రథమ చికిత్స ఇలా..

పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పాము కాటువేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషయం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ గుర్తు మాదిరి ఒక సెంటిమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు పోతుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళితే విషానికి యాంటీ వీనమ్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. రాత్రి వేళల్లో పొలం వద్దకు వెళ్లే రైతులు కాళ్లకు చెప్పులు వేసుకొని, శబ్దం చేస్తూ టార్చ్ లైట్ వెంట తీసుకెళ్లాలి.

రక్త పింజర కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తోంది. అర గంటలో నోట్లోంచి, చెవుల్లోంచి రక్త స్రావం జరుగుతుంది.

అప్రమత్తంగా ఉండాలి



పాము నుంచి రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైతే యాంటి వీనమ్ మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు, గడివేముల

అన్ని పాములు ప్రమాదకరం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. నాగుపాము, కట్ల పాము, రక్తపింజర వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాధారణంగా 50 శాతంపైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు అంటున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయిం చుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

అనాథలకు ఆధార్ జారీపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీఓ శారద

కర్నూలు (అర్బన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు బుధవారం ఇందిరాగాంధీ నగర్‌లో స్వాతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ.. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ దిశా నిర్దేశాలతో నిరాశ్రయులైన అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డులను జారీ చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్వాతి కమిటీ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలైన విద్య, వైద్యం, పునరావాసం షెల్టర్ హోమ్‌లో ప్రవేశం కల్పించడం, స్కాలర్‌షిప్స్, మిడ్ డే మీల్స్ సదుపాయాల అర్హత కల్పించడం కోసం రోడ్డు పక్కన నివశిస్తున్న పిల్లలు, అనాథలు, తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారిని గుర్తించి వారికి ఆధార్ కార్డు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సలహాలను అందించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దు

సి.బెళగల్: మండలంలో డీలర్ల ద్వారా చేపట్టే రేషన్ సరుకుల పంపిణీని నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. ఆమె బుధవారం తన కార్యాలయంలో ఆర్ఐ తరుణ్‌తో కలిసి మండలంలోని రేషన్ డీలర్లతో సరుకుల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. డీలర్లు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పకుండా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా వచ్చే నెలలో సైతం 65 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల దగ్గరే రేషన్ సరుకులను అందించాలని ఆదేశించారు. సరుకుల పంపిణీలో అలసత్వం వహిస్తే యంత్రాంగంపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన డీలర్ల సంఘం ఎంపిక

బుధవారం సి.బెళగల్‌లో సమావేశమైన రేషన్ డీలర్లు మండల సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడిగా కమాల్, అధ్యక్షుడిగా శ్రీరాములు, ఉపాధ్యాక్షుడిగా రఘునాథ్, నర్సయ్యశెట్టి, ప్రధాన కార్యదర్శిగా నాగమద్దిలేటి, కార్యదర్శిగా శేషన్న, కోశాధికారిగా లింగేశ్వరప్పతోపాటు మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా, మిగిలిన డీలర్లు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎనుకోవడం జరిగిందని డీలర్లు భాస్కర్ రెడ్డి, యల్లేశ్వరబాబు, తిక్కన్నలు తెలిపారు. అనంతరం మండల డీలర్ల సంఘం సభ్యులు తహసీల్దార్ వెంకటలక్ష్మిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.



సి.బెళగల్‌లో తహసీల్దార్ వెంకటలక్ష్మితో డీలర్ల సంఘం సభ్యులు

సీఎస్ఆర్ఎంఓ బీవీ రావు బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన్ను గుంటూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ చేశారు. అక్కడ సీఎస్ఆర్ఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు.

నేడు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఒలింపిక్ డే పురస్కరించుకొని గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న వ్యాయామ హాలులో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బాలికలకు, 11 గంటలకు పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజేతలకు ఒలింపిక్ డే పురస్కరించుకొని పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

డీఎస్‌డీఓకు ఆర్‌టీఐ నోటీసులు

– నేడు మంగళగిరి కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ ఉత్తర్వులు

కర్నూలు(టౌన్): జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుకు రాష్ట్ర సమాచార హక్కు చట్టం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 19న గురువారం మంగళగిరిలోని సమాచార హక్కు కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం నిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా శిక్షణ కార్యక్రమాలు, స్టేడియం ఆదాయం వివరాలు, ఏటా జరిగే ఆడిట్ రిపోర్టు, రసీదులు తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా వివరాలు ఇవ్వకుండా స్టేడియం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు చెప్పారు. దీంతో రెండో అప్పీల్‌గా రాష్ట్ర క్రీడా శాఖను సమాచారం కోసం సంప్రదించగా ఇక్కడ కూడా స్పందన లేదన్నారు. చివరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్‌ను ఆశ్రయించానని రెండు నెలల అనంతరం కమిషన్ స్పందించి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కల్లూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అన్నారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఉలిందకొండ గ్రామంలో చాలా మంది విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం డబ్బులు జమకాలేదని వైస్ ఎంపీపీ–1 చంద్రకళ సభ దృష్టికి తీసుకొచ్చారు. కె. మార్కాపురంలో కొంతమందికి అర్హత జాబితాలో వచ్చిందని, కానీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని సమస్యను పరిష్కారించాలని సర్పంచ్ గణ మద్దిలేటి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా సచివాలయ ఉద్యోగులు స్పందించడం లేదన్నారు. తల్లికి వందనం పథకం కింద రూ. 13వేలు తల్లుల ఖాతాలో జమవుతున్నాయి. రూ. 2వేలు పాఠశాలల మేంటినైన్స్ అంటున్నారు. అయితే ప్రైవేటు పాఠశాలలకు కూడా మేంటెనెన్స్ రూ. 2వేలు ఇస్తున్నారా? అని సభలో పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి సభలో ప్రశ్నించారు. కె. మార్కాపురంలోని రేషన్ దుకాణానికి రావాల్సిన బ్యాగ్‌లాగ్ నిత్యావసర సరుకులను ఇప్పించాలని సర్పంచ్ మద్దిలేటి అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

తాగునీరు వృథా



గోరంట్లలో పైపులైన్ పగలడంతో వృథాగా పోతున్న తాగునీరు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయ సమీపంలో తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతుంది. పైపులైన్ పగిలిపోయి నెల రోజులవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. పైపులైన్ పగిలిపోవడంతో ఆ ప్రాంతంలో నీరు కలుషితమవుతోందని, అధికారులు స్పందించి తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి శుభ్రమైన తాగునీటినందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కౌలూరులో నీటి సమస్య



నీళ్లు రాని కుళాయి

పాణ్యం : మండల పరిధిలోని కౌలూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నీటి ఎద్దడి నెలకొంది. మూడు రోజులుగా కుళాయిలకు నీరు రావడం లేదని కాలనీ వాసులు తెలిపారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి నీటిని వదిలారని, మరుటి రోజు నుంచి నీరు రావడం లేదన్నారు. పనులు మానుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి కుళాయిలకు నీటి వదలాలని కోరుతున్నారు. విషయంపై ఏఈ మధుశేఖర్‌ను వివరణ కొరగా పైపులైన్ లీకేజీ కారణంగా నీటి సరఫరా లేదని, ప్రజలకు అనువైన సమయంలో నీటి వదులుతామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం–5లో అతిసారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా సోకితే అది ప్రాణాంతకండా మారే ప్రమాదం ఉందన్నారు. తీవ్రమైన వాంతులు, విరేచనాలు వచ్చినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మందు బిళ్లలు వాడాలని సూచించారు. 14 రోజులపాటు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇవ్వడం ద్వారా విరేచనాలు తగ్గుముఖం పడతాయన్నారు. తగ్గకపోతే మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, మద్దమ్మ, స్వర్ణగౌరి, నిరజా, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉలిందకొండ, చిన్నటేకూరు గ్రామాల్లో శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.




డయేరియాపై అవగాహన కల్పిస్తున్న సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

బదిలీలు రీ కౌన్సెలింగ్ చేయాలి

కర్నూలు (హాస్పిటల్): ఏపీ హంస గుర్తింపునకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో బదిలీలను తిరిగి నిర్వహించాలని ఆ సంస్థ కర్నూలు నగర అధ్యక్షుడు గోవిందు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సాధారణ బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ హంస గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేయడం వల్ల బదిలీల్లో సంఘ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తక్షణమే హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా బదిలీల్లో రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సికిల్‌సెల్‌తో చిక్కిశల్యం

- చిన్నారుల్లో అరుదైన రక్తవ్యాధి
- పలు రకాల అనారోగ్య ఇబ్బందులు
- పెన్షన్‌తో ఆదుకున్న గత ప్రభుత్వం
- నేడు జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం



గుండ్రంగా ఉన్నవి ఎర్ర రక్త కణాలు, కొడవలి ఆకారంలో ఉన్నవి సికిల్‌సెల్ రక్త కణాలు

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రటి ఆకారంలో ఉంటాయి. కానీ సికిల్‌సెల్ వ్యాధి వచ్చిన వారిలో మాత్రం ఇవి కొడవలి ఆకారంలో ఉంటాయి. ఇవి శరీరమంతా వ్యాపించి పలు అనారోగ్యాలకు దారి తీసేలా చేస్తుంటాయి. పుట్టుకతోనే సోకే ఈ వ్యాధి జీవితాంతం వారిని వేధిస్తుంది. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారులు ఈ వ్యాధి కారణంగా ఏ పనీ చేతగాక నిస్సత్తువతో ఒకేచోట కుప్పకూలిపోతుంటారు. సమాజంలో అరుదైన ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 19న జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉండి మనిషి శరీరమంతా ప్రయాణించి వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. కాగా కొంత మందిలో ఈ కణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెంది ఉంటాయి. దీనినే సికిల్‌సెల్ వ్యాధిగా వైద్యులు పిలుస్తారు. ఈ వ్యాధి ఉన్న వారి రక్త కణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గా, మరొకటి మామూలుగా ఉంటే అలాంటి వారిని సికిల్‌సెల్ క్యారియర్లు ఉంటారు. వీరికి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే వారికి జన్మించే పిల్లలకు రక్త కణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రక్తకణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్‌సెల్ రక్తకణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. ఇవి నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్త హీనతకు గురవుతారు. అంతేగాక సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందడం తగ్గిపోతుంది. ఈ కారణంగా ఈ వ్యాధిగ్రస్తులు తగిన చికిత్స తీసుకోకపోతే 15 ఏళ్లలోపే మరణించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 40 మందికి పైగా ఉన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఇలాంటి వ్యాధిగ్రస్తులు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి అరుదైన వ్యాధి ఉన్న వారికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.10 వేల ప్రత్యేక పెన్షన్ ఇచ్చి ఆదుకున్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్ష

ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక రక్త పరీక్ష ఖరీదు తక్కువలోనే ఉంటుంది. రక్త నమూనాను సోడియం మెటాబైసల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా? వంపు తిరిగి ఉన్నాయా తెలుసుకోవచ్చు. తద్వారా ఆ వ్యక్తికి సికిల్‌సెల్ వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. జన్యుపరమైన ఈ వ్యాధికి ఇప్పటివరకు మందు లేదు. సికిల్‌సెల్ క్యారియర్లుగా గుర్తించి, వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగకుండా నియంత్రించవచ్చు.

వ్యాధి లక్షణాలు

- దీర్ఘకాలం పాటు కామెర్లు ఉంటాయి
- రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతి వేళ్ల వాపుతో వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం, నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు పడటం వంటి లక్షణాలు ఉంటాయి
- శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్దీ లక్షణాలు కనిపిస్తాయి.
- ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతూ ఉంటారు.

సికిల్‌సెల్‌తో పలు రకాల జబ్బులు



సికిల్ సెల్ వ్యాధి వంశపారపర్యంగా వస్తుంది. ఇది రక్తనాళాల్లో వచ్చే వ్యాధి. జీవితాంతం ఉంటుంది. దీన్ని ముందస్తుగా నిర్ధారణ చేసుకుని చికిత్స తీసుకుంటే మేలు. ఈ వ్యాధిలో శరీరంలో రక్తసరఫరా సరిగ్గా జరగక ఇబ్బందులు వస్తాయి. రక్తనాళాల్లో విపరీతమైన నొప్పులు, వాంతులు, కీళ్ల నొప్పులతో పాటు ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ, కాలేయం వంటివి ఎఫెక్ట్ అవుతూ ఉంటాయి. ఈ వ్యాధిగ్రస్తులు వైద్యులు సూచించిన మేరకు రెగ్యులర్‌గా మందులు వాడాలి.

– డాక్టర్ కె.విద్యాసాగర్, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



తల్లిదండ్రుల్లో ఇద్దరికీ సికిల్‌సెల్ వ్యాధి ఉంటే వారికి పుట్టబోయే శిశువుకు సైతం ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే గర్భం దాల్చక ముందే పుట్టబోయే శిశువుకు ఈ వ్యాధి రాకుండా తల్లికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తాం. గర్భం దాల్చిన తర్వాత వస్తే బిడ్డకు వచ్చే అవకాశం ఉందా, లేదా అని తెలుసుకోవడానికి ఉమ్మనీరును పరీక్షకు పంపిస్తాం. ప్రసవం తర్వాత అయితే బిడ్డకు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తాం. ఈ వ్యాధి ఉంటే అవసరమైన చికిత్స అందిస్తాం. గర్భిణిగా ఉన్నప్పుడు సికిల్‌సెల్ ఉంటే నెలలు నిండకముందే బిడ్డ జన్మించే అవకాశం ఉంది. దీనివల్ల శిశువు బరువు తక్కువగా ఉంటుంది. ఒక్కోసారి అబార్షన్ అయ్యే అవకాశం కూడా ఉంటుంది. – డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కర్నూలు(సెంట్రల్): దూపాడు – కోట్ల రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని శవం లభ్యమైంది. లైట్ పింక్ కలర్ ఫుల్ హ్యాండ్ రెడీమేడ్ షర్ట్, తెల్లని ఫుల్ బనియన్, నలుపు రంగు షార్ట్ వేసుకున్న మృతుడు కోట్ల రైల్వే స్టేషన్‌కు దక్షిణముఖాన 25 మీటర్ల దూరంలో చనిపోయి ఉన్నాడు. తెల్లవారుజామున 4.30 గంటల కంటే ముందుగా చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉంటుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు. అతని శవాన్ని గుర్తు పట్టిన వారు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి(99088 89696), కర్నూలు ప్రభుత్వ రైల్వే డబ్ల్యూఎస్‌ఐ కె.కుమారి (83670 37525) ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ టీసీ మాధవస్వామి తెలిపారు.

దినచర్యలో క్రీడలు భాగం కావాలి



పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

కర్నూలు (టౌన్): విద్యార్థుల దినచర్యలో క్రీడలు అంతర్భాగంకావాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఒలింపిక్ డే రన్ క్రీడోత్సవాల్లో భాగంగా వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా పోటీలను నిర్వహించారు. పోటీలను రాష్ట్ర యోగా చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. మాట్లాడుతూ ఈ నెల 23న నిర్వహించే ఒలింపిక్ రన్‌లో పెద్ద ఎత్తున్న క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి రుద్రారెడ్డి అవినాష్ పాల్గొన్నారు.